నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. వైఎంసీఏ ఫీడర్ పరిధిలోని విఠల్‌వాడి, రెడ్డి కాలేజ్ మెయిన్ రోడ్, బ్యాంక్‌ఆఫ్ బరోడా, పోస్టాఫీసు గల్లీ, నారాయణగూడ బ్లడ్ బ్యాంక్ తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కల్యాణం.. కమనీయం

కాచిగూడ: అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్లస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో 'భద్రావతి దేవి – భావనా రుషి మహాముని'కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పల్లకీ ఊరేగింపులో మహిళలు కోలాటం, ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల, గుంటక రూప, పోరండ్ల శారద, కందగట్ల శోభ, సిలువేరు సునిత, బాసాని పద్మ, బండారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నానగర్ బస్తీవాసులకు న్యాయం చేయాలి



ముషీరాబాద్ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బీజేపీ నేత వినయ్‌కుమార్, బస్తీవాసులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని అన్నానగర్ బస్తీవాసులకు న్యాయం చేయాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ జాయింట్ కన్వీనర్ వినయకుమార్ అన్నారు. మంగళవారం బస్తీవాసులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చెందిన స్థానికులు కార్పొరేటర్ పావనిని ఆశ్రయించారు. ఆమె ఆదేశాల మేరకు వినయ్‌కుమార్ ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్‌ను బస్తీవాసులతో కలసి వినతి పత్రాన్ని సమర్పించారు. పేదలు నివసిస్తున్న స్థలం అర్బన్ సీలింగ్ పరిధిలో ఉందన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. ఏళ్లుగా నివసిస్తున్న వారికి నోటీసులు ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. అధికారులు పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు గిరి, సురేష్, యేసు, అజ్మత్, రాజ్‌కుమార్, సంధ్యారాణి, పూర్ణ, సుచిత్ర, వీరమని, శివరాజ పాల్గొన్నారు.

హనుమాన్ కార్యసిద్ధి హోమం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం 2023 సివిల్స్ ర్యాంకర్ ఉదయ్‌కృష్ణారెడ్డి సౌజన్యంతో హనుమాన్ కార్యసిద్ధి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జానకీసుధాకర్, ఈఓ దేవనాథం, పోటీ పరీక్షల అభ్యర్థి సైదానాయక్, అర్చకులు బుగ్గలక్ష్మిపతి శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అపార్ కార్డులోనే విద్యార్థి సమగ్ర యోగ్యత వివరాలు



డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణితో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో అపార్ పథకం కొనసాగుతున్న విధానాన్ని ఉపాధ్యాయులను మంగళవారం సర్వశిక్షా అభియాన్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి నుంచి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్డు వల్ల విద్యార్థికి శాశ్వత గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు, ఇతర ప్రాంతాలలోని పాఠశాలకు బదిలీ చేయడానికి సులువు అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థి సమగ్ర యోగ్యత పూర్తి వివరాలు అపార్ కార్డులోనే ఉంటాయని పేర్కొన్నారు.

బీసీలనే అవమానిస్తారా..?

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా సంఖ్యకు సర్వేలోని గణాంకాలకు పొంతన లేదని విమర్శించారు. మంగళవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభా 4.33 కోట్లు అయితే సర్వే ప్రకారం మాత్రం రాష్ట్ర జనాభా 3.76 కోట్లు మాత్రమే ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 30 శాతం మంది కూడా సర్వేలో పాల్గొనలేదని తెలుస్తోందన్నారు. సర్వేలోని అంశాలను సరళీకరించి రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీలు ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

దివ్య తేజం.. భక్తజన పునీతం

ఆలయాల్లో వైభవంగా రథ సప్తమి వేడుకలు



శంకరమఠంలో ప్రత్యేక అలంకరణలో శారదామాత



శంకరమఠం ప్రాంగణంలో సూర్యనమస్కార పూజ



న్యూ రామాలయంలో సరస్వతి మాతకు పూజలు

నల్లకుంట: సూర్య జయంతిని పురస్కరించుకొని అర్ధ బ్రహ్మోత్సవంగా జరుపుకునే రథ సప్తమి వేడుకలను అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. నల్లకుంట శంకరమఠంలో మంగళవారం ఉదయం శక్తి గణపతికి ఆది పూజలు కావించి, చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. అలాగే త్రిశతి మాల సహిత సర్వ ఆభరణ భూషిత స్వర్ణ కమలాల అలంకరణలో దర్శనమిచ్చిన శారదా మాతకు కుంకుమార్చనలు, పూజలు చేశారు. అనంతరం మఠం ప్రాంగణంలో పండితుల మంత్రోచ్ఛరణల నడుమ షష్ఠి సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం కావించి, సూర్య నమస్కార పూజలు చేసి, గురు పాదుక పూజలు నిర్వహించారు. చండీ పారాయణ ప్రారంభమైంది. ఇష్ట దైవాల దర్శనం కోసం పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

న్యూ రామాలయంలో..

న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతి మాతకు విశేష అలంకరణలో పూజలు నిర్వహించారు. మహిళలు చండీ పారాయణ చేశారు.

సూర్య దేవాలయంలో..

ముషీరాబాద్: సూర్య దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, పీసీసీ కార్యదర్శి జి.ఎన్.కేశవ్, మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య మనవడు అభిషేక్‌రెడ్డి, కృపారాణి తదితరులు పూజలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



రథ సప్తమి పూజలో వి.హనుమంతరావు

కేంద్ర బడ్జెట్‌లో వికలాంగులకు మొండిచేయి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వికలాంగులను పూర్తిగా విస్మరించిందని డెవలెప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా ఇస్తున్న రూ.3000 పింఛన్ పెంచకపోవడం దారుణమని అన్నారు. ఇటీవలనే ఢిల్లీలో వికలాంగుల సంక్షేమ జాతీయ అధికారిని కలిసి తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించామని తెలిపారు. అయినప్పటికీ వికలాంగులకు మొండిచేయి చూపారన్నారు. కేంద్ర ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అందుకు తమ ఉద్యమ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వికలాంగుల ఓటు హక్కుతో బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఏళ్ల తరబడి వికలాంగుల సమస్యలపైన చిత్తశుద్ధి లేదని కేంద్ర ప్రభుత్వం తీరు మరోసారి బయటపడిందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ ద డెఫ్ ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, కార్యదర్శి భారతి తదితరులు పాల్గొన్నారు.

బీసీల జనాభా తగ్గించి చూపడం ప్రభుత్వ కుట్రే.!

టీపీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

కాచిగూడ: బీసీలను రాజకీయంగా అణగదొక్కడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ ఆరోపించారు. మంగళవారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణన నివేదిక తప్పుల తడకగా ఉందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకునేందుకే అగ్రవర్ణాల జనాభాను పెంచి చూపారని ఆరోపించారు. 2011లో తెలంగాణ జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3కోట్ల 70 లక్షలు ఉండగా దానిలో బీసీ జనాభా కోటి 84 లక్షలు చూపించారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన కులగణన నివేదికలో బీసీల జనాభా కోటి 64 లక్షలుగా తగ్గించి చూపాని పేర్కొన్నారు. బీసీల జనాభా పెరగాల్సి ఉండగా తగ్గించి చూపడం రాజకీయ కుట్రలో భాగమేనని పేర్కొన్నారు.

- 2011లో ఓసీసీ జనాభా 10శాతం లోపే ఉండగా ప్రస్తుతం 15.79శాతం పెరిగినట్లు చూపించారని, ఓసీల జనాభా పెరగటం, బీసీల జనాభా తగ్గడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత సర్వే ఫలితాలను పూర్తిగా సమీక్షించి నిజమైన గణాంకాలను వెల్లడించాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ రంగాలలో 52 శాతానికి పెంచాలని, జనాభా బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తే రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని, బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు.


సమగ్ర కులగణన దేశానికే మార్గదర్శకం



రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆళ్ల రామకృష్ణ

కవాడిగూడ: తెలంగాణలో సమగ్ర కులగణన చేపట్టి యావత్ దేశానికే మార్గదర్శకంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందని ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపడుతామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 45 రోజుల్లో కులగణన పూర్తయ్యిందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ... భారత్‌జోడో యాత్రలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి కులగణన చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 12శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సామాజిక న్యాయం అమలు చేయడంలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ ప్రజా ప్రభుత్వంగా పాలన కొనసాగిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెరిపోతుల పరశురాం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు ద్రోహం చేసింది'



మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. బీఎల్ రాజు

కాచిగూడ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశంపై జస్టిస్ షమీర్ అక్తర్ కమిషన్ నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించి మాల, మాల ఉపకులాలకు తీరని ద్రోహం చేసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బీఎల్ రాజు ఆరోపించారు. మంగళవారం నారాయణగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నివేదికలో మాదిగ, మాదిగ ఉపకులాలకు 9శాతం, మాల, మాల ఉపకులాలకు 5శాతం, ఎస్సీ సంచార కులాలకు 1శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ పూర్తిగా మాదిగలకు అధికంగా అవకాశం కల్పించి మాలలకు అన్యాయం చేశారని అన్నారు. నివేదిక శాస్త్రీయంగా జరగలేదన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకటస్వామి, వినోద్ తదితరులు మాల జాతికి వెన్నుపోటు పొడిచి పాలేర్లుగా మారారని విమర్శించారు. ఈ నివేదికపై కోర్టులో సవాల్ చేస్తామని ఆయన ప్రకటించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి మాలలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నేతలు జెఎస్ రావు, నక్క దేవేందర్ రావు, డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా శేషసాయి, నర్సింగ్‌యాదవ్





ముషీరాబాద్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి రోయ్యూరు శేషసాయిని బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ నియమించారు.

- కాచిగూడ: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన కేసరి నర్సింగ్ యాదవ్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. కేంద్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు డాక్టర్ కె.లక్ష్మణ్, జి.కిషన్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తాం



సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు దీపక్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి, నేతలు

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేసి వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేస్తామని పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా నూతన అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు లంకాల దీపక్‌రెడ్డిని, తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్‌ను కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృత స్థాయిలో తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.సూర్యప్రకాష్ సింగ్, వనం రమేష్, బల్వీర్, కృష్ణ కుమార్, శీర్ సాగర్, సుభాష్ పటేల్, కేసరి నర్సింగ్ యాదవ్, అరవింద్, బి.భీమ్‌రాజ్, వాసు, దిలీప్, జగ్గు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బాలాపూర్ ప్రాంతానికి చెందిన డి.మహేష్ (19) డీమార్టులో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ట్రాక్ వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రైల్లో బంగారు ఆభరణాలు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు చోరీ పై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గండిపేటకు చెందిన సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తున్నారు. షాద్‌నగర్ రైల్వే స్టేషన్ వద్దకు రాగానే ఆమె హ్యాండ్ బ్యాగు కనిపించలేదు. దానిలో ఉన్న 13 తులాల బంగారు ఆభరణాలను దొంగలు తస్కరించి హ్యాండ్‌బ్యాగ్‌ను రైలు బోగిలోని డస్ట్‌బిన్ వద్ద పడేసి పారిపోయారు. మంగళవారం సంధ్యారాణి కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి మహబూబ్‌నగర్ రైల్వే ఠాణాకు కేసు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

బాలకార్మిక రహిత దిశగా భాగ్యనగరం

హైదరాబాద్ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ జాసన్



చిక్కడపల్లి: బాల కార్మిక రహిత దిశగా భాగ్యనగరాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని హైదరాబాద్ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ బి.జాసన్ అన్నారు. అందులో భాగంగానే ఆపరేషన్ స్మైల్–11 జనవరి 1వ తేదీ నుంచి 31వరకు విజయవంతంగా నిర్వహించారు. కార్మిక శాఖ అధికారులకు నిత్యం వచ్చే ఫిర్యాదుల ఆధారంగా తనిఖీలు నిర్వహించి బాలకార్మిక రహిత నగరంగా హైదరబాద్‌కు పేరు తెస్తాం. పోలీస్‌శాఖ, కార్మికశాఖ, విద్యాశాఖ, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ చైల్డ్ లేన్, ఎన్‌జీవో ఆర్గనైజేషన్‌లు సంయుక్తంగా తనిఖీలు విజయవతంగా నిర్వహించామని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

ప్రశ్న: ఈ అపరేషన్‌లో భాగంగా ఎంత మందిని రెస్క్యూ చేశారు?

జవాబు: మొత్తం 896

ప్రశ్న: వారిలో బాల కార్మికులు ఎందరు 14 సంవత్సరాలలోపు ఉన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేశారా?

జవాబు: 34 ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి.

ప్రశ్న: 14 సంవత్సరాలపైబడి 18 సంవత్సరాల లోపు కొమర కార్మికులకు వేతన వ్యత్యాసంపై కేసులు నమోదు చేశారా?

జవాబు: 792 వేతన వ్యత్యాసంపై కేసులు నమోదు చేశాం. నగరంలో దాదాపు రూ.45లక్షల వరకు వేతన వ్యత్యాసం కేసులు నమోదు చేసి వారికి న్యాయం చేశాం. ఇది మొత్తం తెలంగాణలోనే అధికం.

ప్రశ్న: ఈనెల డ్రైవ్‌లో అన్ని శాఖల సమన్వయం ఎలా ఉంది?

జవాబు: అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశారు. అందుకే అద్భుతమైన ఫలితాలు సాధించాం.

ప్రశ్న: మళ్లీ ఇలాంటి డ్రైవ్ ఎప్పుడు నిర్వహిస్తారు?

జవాబు: జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకట్‌రాజయ్యకు మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఫిబ్రవరిలో జరిగే నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ టి. వెంకట్‌రాజయ్యకు సమాజ్‌వాది పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి స్పష్టం చేశారు. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ అభ్యర్థిగా తమ పార్టీ నుంచి రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొ. సింహాద్రి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం జరిపిన కులగణన సర్వేలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల జనాభాను తక్కువ చేశారన్నారు. ఈ సర్వే తప్పుల తడకగా భావించి పునఃసమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. అయోధ్యలో జరిగిన సంఘటన విషాదకరని, ఒక దళిత మహిళను అత్యాచారం చేసి చంపేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ విషయంపై సమగ్రంగా దర్యాప్తు జరిపి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ ప్రధాన కార్యదర్శి అక్కల బాబు గౌడ్, ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ టి.వెంకటరాజయ్య, స్వరూపారాణి, రిజ్వాన్, వాజీద్, శ్రీహరి, జె.రాములు తదితరులు పాల్గొన్నారు.

ముందే గుర్తిస్తే కేన్సర్‌ను నివారించొచ్చు



కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్న వైద్యురాలు

ముషీరాబాద్: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కేన్సర్ బారినపడకుండా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ నవ్యతేజ పేర్కొన్నారు. మంగళవారం వరల్డ్ కేన్సర్ డే పురస్కరించుకోని భోలక్‌పూర్‌లోని యాంవీ క్లినిక్‌లో కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు కేన్సర్, స్క్రీనింగ్ టెస్ట్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ నవ్యతేజ మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన మహిళలు తప్పనిసరిగా కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోని కేన్సర్ బారి నుంచి విముక్తి పొందాలన్నారు. మహిళలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సదస్సు నిర్వహించారు. ఆస్పత్రి ఎండీ సందీప్ మాట్లాడుతూ... ఈ నెల 8వ తేదీ వరకు మహిళలకు కేన్సర్ ఉచిత కన్సల్టేషన్, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు సర్వైకల్ కేన్సర్ టెస్టులను నిర్వహిస్తామని తెలిపారు.

వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. గాంధీ ఆస్పత్రి డాక్టర్ బ్రాహ్మణి, డాక్టర్ స్వర్జిత్ ముఖ్య అతిథులుగా హాజరై కేన్సర్‌పై అవగాహన, నివారణ, లక్షణాలు, చికిత్సా విధానాల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ కె.నీరజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఓ.పద్మజ, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ అనసూర్య, వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ శిభారాణిలు హజరయ్యారు.

పార్టీ పటిష్టతకు అంకితభావంతో పనిచేస్తా

సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న భరత్‌గౌడ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా (ముషీరాబాద్, సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలు) అధ్యక్షుడిగా ముషీరాబాద్ నియోజకవర్గంకు చెందిన బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షులు గుండగోని భరత్‌గౌడ్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ అధిష్టానం ఆయన నియామక పత్రాన్ని అందజేసింది. పార్టీ నగర కార్యాలయంలో బీజేపీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి కాంతారావు, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా మాజీ అధ్యక్షులు శ్యామ్‌సుందర్‌గౌడ్‌లు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం చిక్కడపల్లిలోని తన నివాసం వద్ద విలేకరుల సమావేశంలో భరత్‌గౌడ్ మాట్లాడుతూ... తన సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి బన్సాల్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు అంకిత భావంతో పనిచేస్తానని తెలిపారు.

భరత్‌గౌడ్‌కు భోలక్‌పూర్ నేతల సన్మానం

ముషీరాబాద్: బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ను మంగళవారం భోలక్‌పూర్ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బిజ్జి కనకేష్‌కుమార్, ఆర్.విశ్వం, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, సీనియర్ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మగ్దూం మొహియుద్దీన్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్తాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ



ట్యాంక్‌బండ్‌పై మగ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి నివాళులర్పించి జోహార్లు తెలుపుతున్న సీపీఐ నేతలు

కవాడిగూడ: బహుముఖ ప్రజ్ఞాశాలి మగ్దూం మొహియుద్దీన్ పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్మిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నర్సింహ అన్నారు. మంగళవారం మగ్దూం మొహియుద్దీన్ జయంతిని పురస్కరించుకొని సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్‌పై ఉన్న మగ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈటీ నర్సింహ మాట్లాడుతూ... నిరంకుశ నిజాం పాలనలో పటేల్, పట్వారీ, దేశ్‌ముఖ్, భూస్వామ్య ఆగడాలకు వ్యతిరేకంగా తమదైన రచనలతో ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. అభ్యుదయ రచయితల సంఘం, రాష్ట్ర ఉపాధ్యాయ సంగం, యూనివర్సిటీ విద్యార్థులతో కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడంలో క్రియాశీలకమైన పాత్ర పోషించినట్లు వారు పేర్కొన్నారు. నిజాం పాలన అంతమైన తరువాత కూడా ఉమ్మడి రాష్ట్రంలో అనేక కార్మిక ఉద్యమాలకు జాతీయ స్థాయిలో నాయకత్వం వహించారని తెలిపారు. కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటాలు చేయడమే మగ్దూం మొహియుద్దీన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేత ప్రేమ్‌పావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, నాయకులు స్టాలిన్, నళిని, శ్రీకాంత్, గ్యారా నరేష్, సలీం, ఉమర్‌ఖాన్, కుమార్, బాలకృష్ణ, చైతన్య, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.